ఇందిరా పార్కులో పూల వసంతం

- సందర్శకులకు ఆహ్లాదం
- పూల సోయగాలతో ఉక్కు నగరంలో మనోహర దృశ్యం



పార్కులో బంతుల సమూహం



పార్కు లోపల ఇరు వైపులా ఉన్న పూల మొక్కలు



ఇందిరా పార్కులో ప్రవేశ ద్వారం వద్ద బంతులు



స్టీల్‌ప్లాంట్ ఇందిరా పార్కులో విరబూసిన చామంతులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని ఇందిరా పార్కు ప్రస్తుతం బంతి, చామంతి పూలతో కళకళలాడుతోంది. శీతాకాలం, పిక్నిక్‌ల సీజన్‌లో పార్కును సందర్శించే వారికి ఈ పూలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఇందులో భాగంగా, టన్ను ఉత్పత్తికి ఒక చెట్టు చొప్పున లక్షలాది మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతోంది. ఉద్యోగుల సౌకర్యార్థం, వారి పిల్లల మానసిక ఉల్లాసం కోసం టౌన్‌షిప్‌లోని 12 సెక్టార్లలో వివిధ మహనీయుల పేరిట పార్కులను నెలకొల్పారు. ఈ పార్కుల సుందరీకరణ పనుల్లో భాగంగా స్టీల్‌ప్లాంట్ టౌన్ అడ్మిన్ హార్టికల్చర్ విభాగం ఆధ్వర్యంలో నిర్వాసితులతో కూడిన నాలుగు సొసైటీలు (గంగవరం, వడ్లపూడి, అగనంపూడి, పెదగంట్యాడ) పనిచేస్తున్నాయి. ఇవి ఉక్కునగరంలోని పార్కులు, ఉక్కు జనరల్ ఆస్పత్రి, పరిపాలనా భవనం వంటి అధికారిక భవనాల్లో పూదోటలను నిర్వహిస్తున్నాయి. ప్రస్తుతం బంతులు, చామంతులు, దాలియాల సీజన్ కావడంతో ఇందిరా పార్కు, ఉక్కు జనరల్ ఆస్పత్రిలో వివిధ రకాల చామంతులు, బంతులు, దాలియాలు నాటారు. అవి ప్రస్తుతం ఏపుగా పెరిగి సందర్శకులను ఆకర్షిస్తున్నాయి. అయితే, సందర్శకులు పూలను కోయకుండా అదుపు చేయడం పార్కు నిర్వాహకులకు సవాలుగా మారింది. గంగవరం సొసైటీ ఆధ్వర్యంలో జరుగుతున్న పార్కు నిర్వహణ అందరి ప్రశంసలు అందుకుంటోంది. ఇదే స్ఫూర్తితో ప్లాంట్‌లోని ఇతర విభాగాల్లోని పార్కుల్లోనూ పూల తోటలను పెంచితే కార్మికులకు మానసిక ప్రశాంతత లభిస్తుందని ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు.

ప్రశాంతంగా ఉంటుంది



విధులు ముగించుకుని ఇంటికి వచ్చే ఉద్యోగులకు స్టీల్‌ప్లాంట్ పార్కులు ఎంతో ఆహ్లాదాన్ని అందిస్తున్నాయి. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం పర్యావరణ పరిరక్షణకు, మొక్కల పెంపకానికి మొదటి నుంచీ అధిక ప్రాధాన్యత ఇస్తోంది. అందువల్లే ఉక్కునగరంలోని పార్కులు సుందరంగా, ఆహ్లాదకరంగా ఉంటున్నాయి. సీజన్‌కు అనుగుణంగా పూల మొక్కలను పెంచడం వల్ల ఈ పార్కులు మరింత అందంగా తయారవుతున్నాయి.

– ఎస్. రమేష్‌కుమార్, స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి

క్లుప్తంగా

మధ్యవర్తిత్వంపై న్యాయమూర్తులకు అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న న్యాయమూర్తులు

గాజువాక : మండల న్యాయ సేవాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు గాజువాకలోని న్యాయమూర్తులకు 90 రోజుల మధ్యవర్తిత్వ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు జి. షణ్ముఖరావు మాట్లాడుతూ సీపీసీ సెక్షన్ 89 ప్రకారం కోర్టులో దాఖలు చేసిన అన్ని కేసులను మధ్యవర్తిత్వ కేంద్రానికి పంపవలసి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు ఎస్. కవిత, ఎం.వెంకట శేషమ్మ, బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు బి. యశోదర వేదమణి, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆఫ్ గాజువాక సమతకు పురస్కారాలు



పురస్కారాలను అందుకొంటున్న రోటరీ క్లబ్ సమత ప్రతినిధులు

గాజువాక : రోటరీ క్లబ్ ఆఫ్ గాజువాక సమతకు ఏడు సేవా పురస్కారాలు లభించాయి. ఈ మేరకు రాజమండ్రిలో నిర్వహించిన రోటరీ విజయం డిస్ట్రిక్ట్ అవార్డుల వేడుకలో సమత అధ్యక్షుడు సిరట్ల శ్రీనివాస్ (వాసు), ప్రతినిధులు లక్ష్మణరావు, హేమంత్, జాన్ డీన్, వెంకటరావు, సత్యవాణి, సూర్యనారాయణలకు ఆ సంస్థ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎం.వెంకటేశ్వరరావు అందజేశారు.

ఆటో డ్రైవర్‌కు నిత్యావసర సరకుల అందజేత

అగనంపూడి: ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్ పి.నానాజీ కుటుంబానికి 85వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు గెంజి సురేష్ నెలకు సరిపడా రేషన్ సరకులను అందజేశారు. నానాజీ ఆటోపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. నానాజీ ఇటీవల అనారోగ్యంతో ఆస్పత్రి పాలయ్యాడు. విషయం తెలుసుకున్న సురేష్ సాయంత చేసేందుకు ముందుకు వచ్చాడు. కార్యక్రమంలో రాష్ట్ర మేదర సంఘం సలహాదారు ఆరి రవికుమార్ పాల్గొన్నారు.

గాజువాక ఎమ్మెల్యే పల్లా? మురళీకృష్ణా?

- టీడీపీ కార్యకర్తలంతా మురళీకృష్ణ మాటే వినాలంటా..
- ఎమ్మార్వో శ్రీవల్లి పాత్రపైనా అనుమానాలు
- డమ్మీలుగా జోన్-6, ఎస్‌డీసీ అధికారులు
- తెలుగుశక్తి అధ్యక్షుడు బీవీ రామ్

డాబాగార్డెన్స్ : గాజువాక ఎమ్మెల్యే ఎవరనే అనుమానం ప్రజల్లో కలుగుతోందని తెలుగుశక్తి అధ్యక్షుడు బీవీ రామ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గాజువాకలో మురళీకృష్ణ అనే వ్యక్తి అరాచకాలు చూసి ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఎక్కడ చూసినా సెటిల్‌మెంట్లు, భూకబ్జాలు కనిపిస్తున్నాయని, అసలు గాజువాక తెలుగుదేశం పార్టీలో మురళీకృష్ణ పాత్ర ఏంటని కార్యకర్తలే ప్రశ్నిస్తున్నారన్నారు. టీడీపీ కష్టకాలంలో ఉన్నప్పుడు మురళీకృష్ణ ఎక్కడున్నారని, పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే పల్లా పంచన చేరి హవా కొనసాగిస్తూ పార్టీ పరువు తీస్తున్నారని చెప్పారు. ఎవరైనా మురళీకృష్ణ మాటే వినాలని పల్లా శ్రీనివాస్ హుకుం జారీ చేశారనే సమాచారం ఉందన్నారు. గాజువాకలో అక్రమ నిర్మాణాలు, ప్రభుత్వ భూముల కబ్జాలు అడ్డుకునే వారే లేరని, కనీసం అధికారులు చర్యలు తీసుకోవడానికి కూడా స్థానిక ఎమ్మెల్యే పల్లా ఒప్పుకోవడం లేదన్నారు. డబ్బు సంపాదన తప్ప ప్రజల కష్టసుఖాలు గాలికి వదిలేశాడని ఆరోపించారు. ఇదిలా ఉండగా.. మురళీకృష్ణ చేసిన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయని, టీటీడీ బ్రేక్ దర్శనం టికెట్లు ఎవరికిచ్చారో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరా తీయాలన్నారు. కోర్టు పరిధిలో ఉన్న బారిక, ఇనాం భూములను వెబ్‌ల్యాండ్‌లో ఎక్కించేశారని, 70వ వార్డులోని సర్వే నంబరు 67లో గల 1–8లో 8 ఎకరాలు వెబ్‌ల్యాండ్‌లో ఎక్కించారన్నారు. ఈ భూమికి సంబంధించి రైతు కుటుంబాలు కోర్టులో కేసు వేశాయని తెలిపారు. దీనిపై ఎటువంటి తీర్పు రాకుండానే ఆన్‌లైన్‌లోకి ఎక్కించేశారని పేర్కొన్నారు. ఎమ్మార్వో శ్రీవల్లి హయాంలోనే మురళీకృష్ణ ఆమెను అడ్డం పెట్టుకుని, ఈ పనులన్నీ చేయించారని తెలిపారు.

మార్మోగిన సాయి నామస్మరణ



సమతానగర్‌లోని బాబాకు అభిషేకాలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, చింతలపూడి



సమతానగర్‌లోని షిర్డీసాయి శాంతిమందిరంలో బాబాకు సమర్పించిన 108 రకాల నైవేద్యాలు



సాయిబాబాను దర్శించుకునేందుకు బారులుదీరిన భక్తులు

పెదగంట్యాడ: గురుపౌర్ణమి సందర్భంగా గురువారం మండలంలోని పలు సాయిబాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించి, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఏర్పాట్లు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ సత్యంబాబు, కార్యదర్శి రవిశేఖర్, సాయి సేవకుల ఆధ్వర్యంలో బాబాకు భక్తుల చేతుల మీదుగా అభిషేకాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకట్రామయ్య, కరణం ధర్మశ్రీ, కార్పొరేటర్ భూపతిరాజు సుజాత, సాయి సేవకులు, పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకున్నారు. చక్కెర, పాలతో అభిషేకాలు చేయించి, 108 రకాల మిఠాయిలతో నైవేద్యం సమర్పించారు. మధ్యాహ్నం జరిగిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు ప్రసాదం స్వీకరించగా, సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలు, ప్రసాదం వితరణ కార్యక్రమాలు అలరించాయి. 74వ వార్డు పరిధిలోని దయాల్‌నగర్‌లోని బాబా ఆలయంలో ఆలయ ధర్మకర్త తిప్పల నితీష్ రెడ్డి, ప్రణీత దంపతులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శాకాంబరి అలంకరణలో దుర్గాదేవి

జీవీఎంసీ 76వ వార్డులోని బర్మా కాలనీలో కొలువుదీరిన దుర్గాదేవి, గురువారం శాకంబరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు శశిశర్మ, ఆలయ అధ్యక్షుడు ఎస్. సన్యాసిరావు, కార్యదర్శి పి. అప్పారావు ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.







శాకాంబరి అలంకరణలో శ్రీమహాదుర్గ, శ్రీమహాలక్ష్మి, శ్రీమహాసరస్వతి

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

కూర్మన్నపాలెం: గురుపౌర్ణమిని పురస్కరించుకుని గురువారం విశాఖపట్నంలోని షిర్డీ సాయిబాబా ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు తమ సమీపంలోని ఆలయాలకు చేరుకుని సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు. శాతవాహన నగర్‌లోని 86వ వార్డు ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు బాబా దర్శనం చేసుకుని, అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అదేవిధంగా 87వ వార్డులోని కణితి రామాలయం ఆవరణలో ఉన్న సాయిబాబా ఆలయంలోనూ భారీ ఎత్తున అన్నవితరణ జరిగింది. వడ్లపూడి, కూర్మన్నపాలెం, ఉక్కు నిర్వాసిత కాలనీల్లోని దేవాలయాల్లోనూ గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు, భజనలతో పూజలు ఘనంగా నిర్వహించారు.

శాకాంబరీ అలంకరణలో త్రిశక్తి అమ్మవార్లు

ఉక్కునగరం : గురుపౌర్ణమిని పురస్కరించుకుని స్థానిక త్రిశక్తి దేవాలయంలో కొలువైన మహాదుర్గ, మహాలక్ష్మి, మహాసరస్వతి అమ్మవార్లకు గురువారం శాకాంబరీ అలంకరణ చేశారు. ఆలయ ప్రధానార్చకులు ఫణిశర్మ, అర్చకులు నాగేశ్వర శర్మల ఆధ్వర్యంలో అమ్మవార్లను అన్ని రకాల కూరగాయలతో అందంగా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు.



సాయినాథునికి అన్నాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు



కణితి రామాలయంలోని సాయిబాబాకు పూజలు చేస్తున్న భక్తులు

సాయినాథునికి అన్నాభిషేకం

అగనంపూడి: గురుపౌర్ణమిని పురస్కరించుకుని అగనంపూడిలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉదయం నుంచే అగనంపూడి పరిసర ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం అన్నాభిషేకం జరిపించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి, నాయకులు దాడి రత్నాకర్, మంత్రి రాజశేఖర్, కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, ప్రసాద్, రౌతు శ్రీనివాసరావు, దుల్ల రామునాయుడు, లక్ష్మి తదితరులు పాల్గొని పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు కొయ్య వెంకటరమణారెడ్డి, ధర్మాల వ్యాసశర్మ, శంభుడు, పి.రామారావు, డి.సత్యలక్ష్మి, సత్యశ్రీదేవి, జి.లీలావతి, ఎం.పద్మ, జ్యోతి, అలాగే చిన్నతల్లి, వీరబాబు, వీరారెడ్డి, దేవనాథ్ దంపతులు కార్యక్రమంలో పాల్గొన్నారు

బాబు మోసాలపై విస్తృత ప్రచారం



బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న నాగిరెడ్డి

గాజువాక : కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు మోసాలను ప్రజలకు అర్థమయ్యే విధంగా విస్తృత ప్రచారం నిర్వహించాలని గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కోరారు. 67వ వార్డులో గురువారం నిర్వహించిన బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలను చంద్రబాబు మోసగించారన్నారు. అధికారం చేపట్టి ఏడాది గడిచినా హామీలను అమలు చేయలేదన్నారు. విలువలకు, విశ్వసనీయతకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారన్నారు. ప్రజలకిచ్చిన ఎన్నికల హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా అధికారం చేపట్టిన మరుక్షణమే అమలు చేసిన ఘనత జగన్ మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ఈ విషయాలను ప్రజలకు గుర్తు చేయాలని కోరారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పల్లా సురేష్, జిల్లా అధికార ప్రతినిధి ఎస్.ఎం.డీ.గౌస్, నాయకులు పల్లా చినతల్లి, అచ్చయ్యనాయుడు, రాజేష్, కామినాయుడు, ప్రభాకర్, పల్లా రాజు, జగన్, గోపి, ఈశ్వరరావు, సూర్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

పీటీఎంకు హాజరు అంతంతే..!

- ఉపాధ్యాయులు– కూటమి నేతలతోనే సమావేశం
- ఆసక్తి చూపని తల్లిదండ్రులు
- తూతూ మంత్రంగా మెగా టీచర్స్–పేరెంట్స్ మీట్

కూర్మన్నపాలెం : రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు గురువారం వివిధ పాఠశాలల్లో నిర్వహించిన మెగా పేరెంట్స్–టీచర్స్ సమావేశాలు (పీటీఎం) సాదాసీదాగానే ముగిశాయి. ప్రభుత్వ అధికారులు, అధికార పార్టీ నాయకులు విస్తృతంగా ప్రచారం చేసినప్పటికీ, తల్లిదండ్రుల నుంచి అంతంత మాత్రంగానే స్పందన లభించింది. దీంతో ఉపాధ్యాయులు ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహించి ముగించారు. 87వ వార్డులో కార్యక్రమాలు విజయవంతం కావాలని కార్పొరేటర్‌తో పాటు పలువురు నేతలు పిలుపునిచ్చారు. అతిథులు ఏ పాఠశాలకు ఏ సమయానికి వస్తారనే వివరాలను ముందుగానే తెలియజేశారు. అయితే నాయకులు ఊహించినంత మంది తల్లిదండ్రులు హాజరు కాకపోవడంతో ఎక్కువ శాతం కార్యక్రమాలు పిల్లలతోనే నిర్వహించారు. కణితి, అప్పికొండ, దుగ్గపువానిపాలెం, వడ్లపూడి తదితర ప్రాథమిక పాఠశాలలతో పాటు కణితి హైస్కూల్‌లోనూ ఈ కార్యక్రమాలు జరిగాయి. వీటన్నింటికీ 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్ అతిథిగా హాజరై కార్యక్రమాలు నిర్వహించారు. కణితి హైస్కూల్‌లో మాత్రం పిల్లలకు ఆటల పోటీలు, పిల్లల తల్లులకు మ్యూజిక్ చైర్ పోటీలు నిర్వహించారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్. నర్సింగరావు సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ బొండా జగన్ విద్యార్థులకు బ్యాగులు, యూనిఫాంలు అందజేశారు. ఈ కార్యక్రమాలన్నింటికీ ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సందడిగా మెగా పీటీఎం

అగనంపూడి : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచడం, విద్యా ప్రగతిని సాధించడం, నాణ్యమైన విద్యను అందించడం లక్ష్యంగా అన్ని పాఠశాలల్లో తల్లిదండ్రుల–ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలు (మెగా పీటీఎం) నిర్వహిస్తున్నట్లు అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు తెలిపారు. లంకెలపాలెం, పెదముషిడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జరిగిన మెగా పీటీఎంలలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులతో, వారి తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయించి, తల్లిదండ్రులకు పలు ఆటలు ఆడించారు. అనంతరం సహపంక్తి భోజనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరవాడ మండల విద్యాశాఖాధికారి గొంతిన సాయి శైలజ, కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు రౌతు నాగేశ్వరరావు, కృష్ణ, విద్యా కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. 85వ వార్డు అగనంపూడి సమీపంలోని ఏబీఎస్ పాఠశాలలో జరిగిన మెగా పీటీఎంలో తల్లులకు పిల్లలు పాదాభివందనాలు చేసి, కాళ్లు కడిగి పూజలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు పి.ఎం.కొండయ్య, ప్రిన్సిపాల్ పద్మజ, డైరెక్టర్ దీపక్ పాల్గొన్నారు. దానబోయిపాలెం (దిబ్బపాలెం) పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో గ్రామ నాయకులు యలమంచిలి చిన అప్పారావు, శీరంశెట్టి బాబ్జి, పాఠశాల హెచ్‌ఎం శ్రీలేఖ, ఉపాధ్యాయులు సుజాత తదితరులు పాల్గొన్నారు.



కణితి హైస్కూల్లో విద్యార్థులతో కార్పొరేటర్ జగన్



నడుపూరు పాఠశాల సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ లక్ష్మీభాయ్



లంకెలపాలెం పాఠశాలలో సహపంక్తి భోజనాలు చేస్తున్న డీఈఓ అప్పారావు నాయుడు



గీతాలు ఆలపిస్తున్న విద్యార్థులు



ఏబీఎస్ పాఠశాలలో తల్లులకు పాదాభివందనాలు చేస్తున్న విద్యార్థులు

ఉపాధ్యాయుల చేతిలోనే విద్యార్థుల భవిత

పెదగంట్యాడ: విద్యార్థుల స్థితిగతులు, ప్రగతిని తెలుసుకునే లక్ష్యంతో గురువారం మండలవ్యాప్తంగా మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ సమావేశం (పీటీఎం) ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి కార్పొరేటర్లు పులి లక్ష్మీభాయ్, భూపతిరాజు సుజాత, తిప్పల వంశీరెడ్డి, మండల విద్యాశాఖాధికారి కంకటాల రమణాజీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థుల భవిష్యత్తు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని వక్తలు ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలి

ఉక్కునగరం: పిల్లలు ఉన్నత లక్ష్యాలను సాధించాలంటే తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో అవసరమని అరబిందో ఐడియల్ హైస్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ వి. రామారావు అన్నారు. గురువారం పాఠశాలలో జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ప్రముఖ సైకాలజిస్ట్, లైఫ్ కోచ్, పబ్లిక్ స్పీకింగ్ మెంటర్ ఆకుల ఉదయ భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్య సాధనకు తీసుకోవాల్సిన కీలక చర్యలను వివరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

గాజువాకలో..

గాజువాక : గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయురాలు కె. విజయప్రశాంతి ఆధ్వర్యంలో జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాన్ని 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు ప్రారంభించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు తాము చేస్తున్న కృషిని ఉపాధ్యాయులు వివరించారు. అనంతరం తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి విశ్వనాథం, డీసీఎంఎస్ మాజీ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, కోరమాండల్ ఫెర్టిలైజర్స్ కంపెనీ హెచ్‌ఆర్ జనరల్ మేనేజర్ ఆర్.శ్రీనివాసరావు, సీఎస్‌ఆర్ డిప్యూటీ మేనేజర్ ఎస్.వెంకట రమణ, సీఎస్‌ఆర్ ఎడ్యుకేషనల్ కో ఆర్డినేటర్ బి.ఎర్నికుమారి తదితరుల పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ అనూష లతీష్

మింది జిల్లా పరిషత్ హైస్కూల్‌లో..

మింది జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో 68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష లతీష్ పాల్గొన్నారు. ఈ సమావేశం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య బలమైన వారధిగా ఉపయోగపడాలని ఆమె ఆకాంక్షించారు. తహసీల్దార్ బి. శ్రీనివాసరావు, స్థానిక నాయకురాలు అనంతలక్ష్మి పాల్గొన్నారు.